

# రహస్యముఖం

నగ్నముని


హైదరాబాదులోని సిటిబస్సులు, పౌరులు చెయ్యని నేరాలకు అనుభవించే శిక్షలు. బహుశా ఆటోగాని, రిక్షాగాని ఎక్కే స్తోమతులేకపోవడమే పౌరులు చేసిన నేరం అనుకుంటాను. పిచ్చాసుపత్రిలా మారుతున్న నగరం. వాంతులు చేసుకున్నట్లు రోడ్లపక్క దుకాణాలు. చెల్లాచెదరైన చీమల్లా జనం. చర్మరోగిలా నగర దేహం. క్రిముల్లా నల్లడబ్బుతో ఎక్కడబడితే అక్కడ మొలుస్తున్న భవనాలు. సాంస్కృతిక మరుగుదొడ్డు లాగా సినిమా థియేటర్లు. అందవికారమైన జీవనం. కాటికాపరికి శవాలపై వుండే ప్రేమలాంటిది పౌరులపై పాలకుల ప్రేమ.

కోటీలో బస్సుకోసం నుంచున్నాను. గంట దాటింది; ఆఫీసులు స్కూళ్లు కాలేజీలొదిలి, అడవిలో దట్టంగా ఎదిగిన చెట్లలా బస్టాండులో గుంపులు గుంపులుగా జనం. మధ్యాహ్నం నుంచి చిన్న తుప్పర. గట్టిగాపడదు మానదు. త్వరగా యింటికి వెళ్లాలి.

అన్నికళ్లూ ఎటునుంచన్నా బస్సొచ్చి తమకు ముక్తి ప్రసాదిస్తుందేమోనని ఆశగా చూస్తున్నయ్. ఎప్పటికో నాంపల్లి నుంచి కటికవాని కత్తిలా ఓ బస్సు దూసుకొచ్చింది. మూడు బస్సుల జనం ఒక బస్సులో, బస్సు ఆగటం జనం వాలడం, ద్వారందగ్గర దిగేవాళ్లని దిగనివ్వకుండా యీగల్లా మూగిన జనం. కింద రొచ్చు. ఒకటే బస్సు. నేల బిద్దలై ముందుకాళ్లు మాత్రమే పుట్టినట్లు యీనుతున్న జనం. త్వరగా ఇంటికెళ్లాలి. వెళ్లలేకపోతే ఆ తర్వాత యింటిదగ్గర చాలా ఇబ్బందిపడాలి. ఈ బస్సుపోతే మళ్లీ బస్సు ఎప్పటికో. మరోటి వచ్చినా ఆగుతుందో, లేదో. మనసంతా రొచ్చుగా వుంది. జారిపోతున్న దేహాన్ని కూడదీసుకుని, ఓడిపోతున్న కాళ్లని కడ్డీలుగా చేసి అతికష్టంమీద ద్వారందగ్గరకొచ్చి నిలబడ్డాను ఆ తరవాత ఏమి జరిగిందో, ఎంతమంది తోశారో, ఏమి చేశారో. నడుంమీద, బుజాలమీద, మెడలమీద మోచేతుల్తో తోపుడుమాత్రం తెలుసు. లోపలికొచ్చిపడ్డాను.

లోపల నరకం ముక్క. చీకటి, తలచుట్టూ పాముల్లా బుసలుకొడుతున్న శ్వాసలు. కడ్డీలు పట్టుకుని వేలాడుతున్న ఆకారాలు. ఒంటిని అసహ్యంగా నొక్కేస్తున్న పౌరుల అవయవాలు. కుమ్ములో వంకాయలా దేహం. కత్తి గుచ్చితే దిగేట్టులేదు. జనం,జనం. బస్సు త్వరగా బయల్దేరి, మధ్యలా చెడిందని ఆపెయ్యకుండా త్వరగా ఇంటికి చేరుకుంటే బాగుండు. ఇంతకంటే ఇవాల్టికింకే కోరికా లేదు.

నరకం ఎలా వుంటుందో, నరకదేశంలో ఏవేం శిక్షలున్నాయో, ఎటువంటి ప్రభుత్వం వుందో నాకు తెలీదు. ఇక్కడ మాత్రం కాసేపు నాకాళ్లమీద నేను నుంచోవడం ఎంత కష్టమో తెలుస్తోంది. స్టాపువచ్చి బస్సు కాసేపు ఆగినప్పుడల్లా డొక్కలో పొడుస్తూ దిగే



వాళ్లూ ముందుకు వెళ్లమని అరిచేవాళ్లూ.

దిగే వాళ్లని దిగనివ్వకుండా ఎక్కే వాళ్లని ఎక్కనివ్వకుండా నరక ద్వార పాలకుల్లా కడ్డీలు పట్టుకుని, బస్సుమెట్ల మీద అడ్డంగా నుంచుని తమ యువశక్తి నంతా అక్కడే ప్రదర్శిస్తున్న కాలేజీ కుర్రాళ్లు. స్టాపురాగానే రాలిపోతారు. తిరిగి అతుక్కునేవారు కొందరు. కండక్టరు అష్టకష్టావధాని. జనంలో ఈదుతూ నింపాదిలా టిక్కెట్లిస్తున్నాడు, పాసింజెర్లు చిల్లరకు బదులు నోట్లిచ్చినప్పుడల్లా అలస్యం పెరుగుతోంది. నాకు జనరల్ పాసుంది, బతికి పొయ్యాను. ఎక్కడికెళ్లాలో చెప్పడం చిల్లర లేకపోతే కండక్టరుతో సంభాషణలోకి దిగడం, దానివల్ల బస్సు మరి కాసేపు అక్కడే కూరుకుపోవడం తప్పింది. డొక్కలో మరికొన్ని పోట్లూ కుమ్ముకోడాలు జరిగాక నేను దిగవలసిన స్టాపొచ్చింది. ఎముకలు ఇతర అవయవాలూ వాని స్థానంలో అవి వున్నాయో లేవో చూసుకుంటూ దిగాను. బయట చల్లగాలి ఇంతవరకూ పడ్డ కష్టాల్ని కసపడని చేత్తో ముఖాన్ని సమిరి తీసేసింది. రోడ్డుదాటి సిగరెట్టు కొనుక్కుందామని అవతల వున్న పాన్‌షాపు దగ్గరకొచ్చాను. అక్కడా జనమే.

చీకటి తుంపరగా రాలుతోంది. పాన్ షాప్‌లో కుర్రాడు మానవయంత్రంలా చకచకా పాన్లు కడుతున్నాడు. మధ్య మధ్య సిగరెట్లు, బీడీలు అందిస్తున్నాడు. డబ్బులు తీసుకుని లోపల చిన్నగా అమర్చిన చెక్కపెట్లో వేసి చిల్లర తీసి యిస్తున్నాడు. షాపు పక్కనే నేలమీద హరికేన్ లాంతరు బాగుచెయ్యడంలో కుస్తీ పడుతున్నాడు. మరో కుర్రాడు వేలాడుతున్న సినీతారల తోరణాల కింద బిళ్లలూ, బిస్కెట్లూ, బుద్ధిగా లోపల గాజు సీసాల ముందు నిలబడ్డవాళ్లు పాన్లూ, సిగరెట్లు, చిల్లర ఎవరికిచ్చినవి వాళ్లు పుచ్చుకుని కదిలాక, నేను కాస్త ముందుకెళ్లి వాక్కావలసిన సిగరెట్ పాకెట్ అడిగి, డబ్బులివ్వటానికి చెయ్యి పాంటు వెనకజేబులో పెట్టాను. రోడ్డు ప్రక్క ఎప్పుడో ప్రాణంపోయి పడున్న బిచ్చగాడి శవంలా ఖాళీజేబు. పర్సు లేదు గుండెకాయ హటాత్తుగా తెగి వెనకజేబులో నా చేతిలో పడ్డట్లయింది. అంత చలిగాలిలోనూ ఒళ్లంతా చెమట పట్టేసింది. అదృశ్య హస్తమేదో కనబడని కత్తిని పొట్టలోకి దింపినట్లయింది. ఆవేళ అఫీసుపని కాస్త పక్కన పెట్టి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ శ్రమించి అతి కష్టంమీద యాభై రూపాయలు అప్పు సంపాదించాను. అయిదు, పది రూపాయలనోట్లు, దారిలో కాఫీ కూడా తాగకుండా అస్త్రారపదంగా పర్సులో ఉంచాను. పదిరూపాయల నోటు పగలగొడితే ఖర్చయిపోతుందనే భయంతో ఇంటివరకూ లాక్కొచ్చాను. ఆ యాభై రూపాయల్తో తృప్తిపరచవలసిన క్షుద్రదేవతల్లాంటి అవసరాలెన్నో వున్నాయి. మనసులో కర్ఫ్యూ విధించి తుపాకుల మనుషులు బూట్లు టకటక లాడించినట్లు ఆలోచనలు. ఆ పర్సులో యాభై రూపాయల్తోబాటు నా ఫొటో, అడ్రసు కూడా వున్నాయి అంతేకాదు. అన్నిటికంటే ముఖ్యం-ప్రస్తుతం పాన్‌బ్రోకరు దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న ఒకానొక అతి ముఖ్యమైన వస్తువు తాలూకు రశీదు కూడా వుంది. డబ్బు కట్టినా, ఆ రశీదు లేందే ఆ వస్తువు, వాడి దగ్గరనుంచి తీసుకోవడం కొత్తగా ఆ వస్తువును కొనుక్కోవడమంత కష్టం. నా ముఖంలో ఏం చదివాడో పాన్‌షాపు కుర్రాడు, తర్వాత ఇద్దురుగాని తీసుకోండి సార్, అని సిగరెట్టు పెట్టి అందించాడు. శవాన్ని పాతిపెట్టి తడిబట్టల్తో ఇంటి కొస్తున్నవాడిలా ఇంటికొచ్చి బట్టలు మార్చుకుని, ముఖం కడుక్కుని వాలు కుర్చీలో గోతిలోకూచున్నట్లు వేదాంతిలా కూచున్నాను.


ఏదీ ఆగదు. అవసరాలూ అగవు. కాలం ఎవరి పర్సునుబట్టి వాళ్లకి నడుస్తుంది. జరుగుబాటు వున్నవాడి గుప్పెట్లో బెస్త వాని చేతిలో తన్నుకునే చేపపిల్లలా తన్నుకునే కాలం, జరుగుబాటులేనివాళ్ల మీంచి రోడ్డురోలర్లా నడుస్తుంది. రెండో రకం వాళ్ళకి దేహంమీద ముడుతల్తోబాటు మనసు కూడా కాస్త కాస్త శిథిలమవుతూ ఉంటుంది.

బస్సులో నా వెనక ఎవరు నుంచున్నారో ముఖాలు గుర్తుచేసుకోవడానికి

ప్రయత్నించాను. అంతా అలుక్కుపోయినట్లు తప్ప, చీకటి ఆకారాలు తప్ప ఏమీ గుర్తురావడంలేదు. కోరమీసం, నూనె నీళ్ల మెరిసేట్లు కలిపిరాసి పైకి ఎత్తుగా దువ్విన దుబ్బుజుట్టు, మెళ్లో ఎర్ర మఫ్లరు, చెంపల జుట్టు, బుగ్గమీద మాసిన కత్తి గాయం, ఇలాంటి వేషంలా నా వెనక ఎవరూ నుంచున్నట్లు గుర్తు రావడంలేదు. అంతా మామూలుగా, జెర్లిన్ పెద్దమనుషులే వున్నారు. వింతగా, విచిత్రంగా సభ్యనాగరికతకు చెందనివాళ్లెవరూ వున్నట్లు లేదు. అయినా నాకు పర్సెందుకు? నోట్లకంటే, చిన్న చిన్న కాగితాలు నలిగిపోకుండా వుండడం కోసం కొన్నది. నా ఫొటో, అడ్రెస్ వున్నాయి కాబట్టి చదివితే ఆ రశీదును బట్టి నా పరిస్థితేమిటో అర్థమవడానికి అవకాశం వుంది కాబట్టి, మనసు కరిగి, నా జేబుదొంగ మిత్రుడు ఆ రశీదునన్నా పోస్టులో పంపించొచ్చునేమో. నేనెప్పుడో ఓ పత్రికలో చదివిన కథ గుర్తొచ్చింది. ఒక జేబుదొంగ ఇలానే పర్సుకొట్టేసి, ఆ పర్సులో యిలాంటి రశీదు ముక్కలుతప్ప మరేం లేకపోవడం చూసి ఆ కాగితం ముక్కలు పోస్టులో తిరిగి పంపించేస్తూ, పర్సులో డబ్బు లేనందుకు దాని తాలూకు యజమానిని డబ్బులేకుండా పర్సెందుకు పెట్టుకు తిరుగుతున్నావని తెగతిడుతూ వుత్తరం రాస్తాడు.

మరో కథలో పర్సుతాలూకు యజమాని భార్య జబ్బుతో మంచంలో పడి వున్న విషయం డాక్టర్ ప్రిస్కిప్షన్ బట్టి తెలుసుకుని పర్సులోని డబ్బు ఎం. ఒ. చేసేస్తాడు.

ఇలా ఎన్నో కథలూ, జరిగిన సంఘటనలూ గుర్తొచ్చాయి. మా వాడుకూడా యిలా చెయ్యగూడదా. ఈ ఆలోచనతో గుహలో అగ్గిపుల్ల వెలిగినట్లు మనసులో ఆశ వెలిగింది.




పోస్టుమాన్‌కోసం ఎదురు చూడ్డంతో ఒక నెల గడిచింది. క్రమంగా ఎదురు చూడ్డం మానెయ్యడానికి ప్రయత్నించాను. గాయం నెమ్మదిగా మానుతోంది, రశీదుపోవడం, డబ్బు పోగొట్టుకోవడం లోని విషాదం కొంత తగ్గి; పకడ్బందీగా వున్న నా జేబును తెరిచి ఎలా పర్సు కొట్టేయగలిగాడా అనే ఆశ్చర్యం మాత్రం యింకా అలానేవుండిపోయింది. ఆ జేబుదొంగ ఎలా వుంటాడో, అతని ముఖం ఒకసారి చూడగలిగితే బాగుండు. ఈ కుతూహలం ఎలా తీరుతుందో తెలియదు.

ఓరోజు సాయంత్రం, అయిదు గంటలకి ముందు ఆఫీసులో లోతుగా పనిలో మునిగి నిలువీత కొడుతుండగా, సుబ్బారావుగారొచ్చి హలో అని గుర్తుచేసి పైకిలేపారు. ఆ మర్నాడే నెలలో మొదటి ఆదివారం అని గుర్తుచేశారు. సుబ్బారావుగారు రచయిత, అంతకంటే మంచి సాహిత్యాభిమాని.

నెలలో మొదటి ఆదివారం సాయంత్రం నాలుగింటికి పిడుగులు పడుతున్నా సుబ్బారావుగారింట్లో రచయితల సమావేశం జరుగుతుంది. పేరుమొయ్యాలనుకునేవాళ్ళూ, పేరుమోస్తున్నవాళ్లూ కొంతమంది రచయితలు చేరి రచనలు చదువుతారు. ఆ తర్వాత సాహిత్యచర్చ చేస్తారు. అమలుచెయ్యటం గురించి ఆలోచించని రంగు రంగు సాహిత్య కార్యక్రమాలు ఆ సమయంలో అక్కడ జన్మిస్తాయి. సుబ్బారావుగారింట్లో ఆ చిన్నపాటి రచయితల సమావేశం హాజరు కావడం వొదులుకోడానికి ఎవరూ యిష్టపడరు. కారణం అక్కడ కురిసే సాహిత్యామృతవర్షం ఆకర్షణ కాదు, చర్చల సమయంలో సుబ్బారావుగారిచ్చే స్వీటు, హాటు, కాఫీ, త్రివేణి, ఫోర్ స్క్వేయిర్ సిగరెట్టు ఎవరు వొదులుకుంటారు.

నేను సుబ్బారావుగారింటికి చాలా తక్కువసార్లువెళ్లాను. కారణం నాకు టిఫిను మీద ప్రేమ లేకకాదు. సుబ్బారావుగారిల్లు మా ఇంటికి చాలా దూరం కావడమే. ఈ సమావేశాలు ప్రారంభించి సంవత్సరం నిండుతున్నదనీ మర్రోజు తప్పక రమ్మని సుబ్బారావుగారు స్వయంగా వొచ్చి చెప్పారని వెళ్లాను. సుబ్బారావుగారు పెద్ద ఆఫీసరు కాకపోయినా, బాగా పలుకుబడి వున్నవాడు కావడంవల్లా, వాళ్ల మామగారు రాజకీయరంగంలో చాలా ముఖ్యమైన పదవుల్లో వున్నవాడు కావడంవల్లా ఆ సమావేశాలకు పెద్ద పెద్ద హోదాల్లో వున్న రచయితలే ఎక్కువగా వస్తూ

వుంటారు. ఆ సమావేశాలను చూస్తే సరస్వతి పేదరాలని ఎవరూ ఒప్పుకోరు. సంవత్సరంపాటు సమావేశాలు జయప్రదంగా నిర్వహించినందుకు అంతా సుబ్బారావుగారిని అభినందించారు. టిఫిన్లు తిన్నాక అంతా తమతమ రచనలు వినిపించారు. కొంతమంది కవితలు, ఒకాయన వ్యాసం వినిపించారు. ఆనాడు చదివిన రచనల్లో అన్నీ ఒకెత్తు, వెంకట్రావుగారు వినిపించిన కథ ఒకెత్తు. వెంకట్రావుగారు ఏదో ప్రైవేటు కంపెనీలో చాలా పెద్ద అధికారి. అదీగాక, ఆయనకు బ్యాంకుల్లో క్రమం తప్పకుండా డబ్బు గుడ్లుపెట్టే అనేక ఇతర వ్యాపకాలున్నాయి. రెండు మేడలూ, రెండు కార్లూ, రెండు పెళ్ళాలూ, ఇంకా చాలాచాలా రెళ్ల కలిగినవాడాయన. ఇవన్నీ ఆయన ఒక్క తలకాయతో చేస్తుండడం చూసి చాలామంది ఆశ్చర్యపోతూ వుంటారు. చాలా ఖరీదైన మనిషి వెంకట్రావుగారు. ఆదివారం సెలవుపూట వున్నవాళ్ల కులాసాగా వేసుకునే తెల్లని పైజామా, లాల్చీలోంచి ఆయన కారు దిగినప్పుడు చాలామంది ఎదురెళ్లి ఆయనను లోపలికి వినయంగా ఆహ్వానించారు. వినయవిధేయతలు ప్రదర్శించే ముఖాలకు చాలా అలవాటుపడిన వాడిలా ఆయన లోపలికొచ్చారు. ఆరోగ్యం చిమ్ముతున్న శరీరం, నున్నగా షేవింగ్, ఉక్కు చేతులూ, కాళ్లూ, ఏ భావమూ తెలీనివ్వని గంభీరమైన ముఖం వెంకట్రావుగారి పుటక చాలా ప్రత్యేకమైనదని తెలియజేస్తున్నాయి. ఆయన చదివిన కథ నిజంగా చాలా బాగుంది. నాలుగు వాక్యాలు చదవగానే ఆయనంత గొప్పగా రాసినందుకు నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. కథ చదువుతూ వుండగానే ఆహా, ఓహోలతో అంతా విపరీతంగా మెచ్చుకున్నారు, రాస్తే అటువంటి కథ రాయాలన్నారు. కథ ముగిశాక ఇది తప్పక అంతర్జాతీయ ఖ్యాతి రావలసిన కథ అన్నారు.

కొంతమందిని చూసినప్పుడు ఎక్కడో యితన్ని చూశానే అని అనిపించినట్లు ఆ కథ ఆయన చదువుతున్నప్పుడు మొదట ఆశ్చర్యం కలిగి, క్రమంగా ఆ కథనెక్కడో నేను చదివినట్టే అనిపించింది. కాస్త కష్టపడి గుర్తుచేసుకుంటే కథ ముగిశాక గుర్తొచ్చింది. అది ఓ హెన్రీ కథ. వెంకట్రావుగారు అనువదించినట్లు చివర్లో చెబుతారనుకున్నాను. ప్రశంస అంతా ముగిశాక తిరిగి అందర్నీ ఆశ్చర్యపరచడానికి వూరుకున్నారనుకున్నాను. కానీ, ఆయన ఆ కథానిక తానే రాసినట్లు ప్రకటించుకున్నారు. సభికులెవరూ ఓ హెన్రీ కథలు చదవలేదో, లేక ఆ కథ చదవలేదో, లేక చదివినా అది వెంకట్రావుగారిది కాదని చెప్పడానికి మొహమాటపడ్డారో నా కర్థంకాలేదు.

కాలేజీ రోజుల్లో నాకు ప్రయిజుగా ఓ హెన్రీ కథల పుస్తకమొకటి ఇచ్చారు. అందులో వుందా కథ. ఆ పుస్తకం ఇప్పటికీ మా ఇంట్లో వుంది. నాకు కథ బాగా గుర్తు.

వెంకట్రావుగారితో నాకు పరిచయం లేదు. ఆయన్ని గురించి విన్నాను తప్ప చూడ్డం యిదే మొదలు. ఆ కథ ఆయన్ది కాదని నేను చెప్పినా ఎవరూ నమ్మేట్లు లేరు. అయినా ప్రయత్నిద్దామని వుంది. సిగరెట్లయిపోయినై, ఎవర్నీ అడగడం ఇష్టంలేదు. సుబ్బారావుగారింటికి దగ్గర్లో షాపు చూశాను. అందుకని బయటికొచ్చాను. సుబ్బారావుగారు ఎందుకో ఇంట్లోకెళ్లడం చూసి బయటికొచ్చాను. షాపు దగ్గర అలవాటు ప్రకారం జేబులో చెయ్యిపెడితే పర్సులేదు, ఇంకా కొత్తది కొనలేదు. కొంటానో, లేదో ముందు జేబులో పెట్టిన చిల్లరతీసి సిగరెట్లు కొనుక్కుని ఒకటి అంటించుకుని తాగుతూ సుబ్బారావుగారింటివైపు వస్తున్నాను. నా జేబుదొంగ మిత్రుడు గుర్తొచ్చాడు. అతని ముఖ మెలావుంటుందోనని వూహించుకుంటూ చాలా రాత్రులు దీర్ఘంగా ఆలోచిస్తూ గడిపిన విషయం కూడా గుర్తొచ్చింది. సమాధానంగా చప్పున నా మనసులో ఓ మెరుపు మెరిసినట్లయింది. అవును ఇలాగే వుండి వుంటాడు, అవును ఆ ముఖం యిలాగే వుండి వుంటుంది అనుకున్నాను.

నేను సుబ్బారావుగారింటిని సమీపిస్తూంటే నా ముందునుండే వెంకట్రావుగారు కారు డ్రైవ్‌చేసుకుంటూ చాలా హుందాగా వెళ్లిపోయారు.

